క్లుప్తంగా

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న ఒడిశా గవర్నర్



గవర్నర్ హరిబాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో ప్రసాదరావు

మహారాణిపేట: ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభం పాటి హరిబాబు కుటుంబ సమేతంగా ఆశీల మెట్టలోని సంపత్ వినాయగర్‌ను గురువారం దర్శించుకున్నారు. అర్చన అనంతరం మంగళ హారతులు అందజేసి, స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం, ఫొటో, స్థలపురాణ పుస్తకాన్ని ఈవో ప్రసాదరావు అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలోని దుర్గాదేవిని గవర్నర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్ – 1 మద్దిలపాలెం శివాలయం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీఎంఆర్ శ్మశానం ప్రాంతం, కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం శివాలయం, భానునగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బహుముఖ ప్రజ్ఞాశాలి



ప్రసంగిస్తున్న ఆచార్య పీఎస్ అవధాని

మద్దిలపాలెం : జీవితంలో స్వచ్ఛత అంతర్భాగం కావాలని ఐఐఐటీ అగర్తల పూర్వ సంచాలకులు ఆచార్య పీఎస్ అవధాని అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నాటకోత్సవ మందిరం ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలుస్తారని కొనియాడారు. నిరాడంబర జీవితం, ఉన్నత ఆలోచన విధానం ఆయన నుంచి యువత నేర్చుకోవాలని సూచించారు. భారత ప్రభుత్వ కార్పొరేట్ అండ్ పబ్లిక్ పాలసీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ కె.యాదగిరి మాట్లాడుతూ యువత స్వచ్ఛత దిశగా అడుగులు వేయడం, సమాజాన్ని నడిపించే బాధ్యత స్వీకరించడం ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ ఉపాధ్యాయులుగా నిలిచే బీఈడీ, ఎంఈడీ విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు స్వచ్ఛత ప్రాధాన్యత వివరించితనొ సూచించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వీకరిస్తూ ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఆచార్యులు ప్రకాష్, ఆలీ, రాము పాల్గొన్నారు.

ఎల్వీపీ వైద్యశాల పరిశోధకులకు అంతర్జాతీయ గౌరవం

ఆరిలోవ: స్టాన్‌ఫర్డ్, ఎల్సెవియర్ విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా ఇటీవల విడుదల చేసిన ప్రపంచ స్థాయి ఉత్తమ పరిశోధకుల వార్షిక జాబితా–2025లో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు చెందిన మొత్తం 15 మంది వైద్యులు స్థానం పొందారు. ఈ విషయాన్ని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సహదేవ గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఎల్వీపీ కేంద్రాలతో పాటు, విశాఖ ఎల్వీపీ కంటి ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. భారతదేశం నుంచి ఈ వార్షిక ర్యాంకింగ్‌లో మొత్తం 61 మంది కంటి వైద్య నిపుణులు ఉండగా, వారిలో 15 మంది ఎల్వీపీకి చెందినవారు కావడం తమ పరిశోధనా శక్తి అంతర్జాతీయ స్థాయిలో ఉందనడానికి నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు, మరో ఏడుగురు ఎల్వీపీ వైద్యులు 'జీవిత కాలం' ర్యాంకింగ్‌లో కూడా ఉన్నట్లు వివరించారు. కంటి వైద్యంలో అందిస్తున్న మెరుగైన ఇంటిగ్రేటెడ్ సేవలే ఈ ఫలితాలకు కారణమని పేర్కొన్నారు.

రోడ్ల విస్తరణకు రాజకీయ గ్రహణం

- ఆరిలోవలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.11.49 కోట్లతో రహదారుల విస్తరణ ప్రారంభం
- తమ ప్రాంత రూపురేఖలు మారడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని భావించిన స్థానికులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పనులు నిలిపేసిన అధికారులు
- రోడ్ల పక్కనున్న టీడీపీ నాయకుల ఇళ్లు, షాపులు పోతాయని ఆందోళన
- వాటిని కాపాడేందుకు విస్తరణను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ఆరోపణలు
- వెలగపూడి రామకృష్ణ తీరుపై మండిపడుతున్న ఆరిలోవ ప్రాంతీయులు

విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధి ఆరిలోవలో రోడ్ల విస్తరణ పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో ప్రారంభించిన పనులను కూటమి సర్కార్ కొలువుదీరగానే మధ్యలోనే నిలిపేశారు. నిలిచిపోయిన పనులు ఒకటిన్నర సంవత్సరాలు గడిచినా ఇంతవరకు పునఃప్రారంభించ లేదు. పనులు పూర్తి చేయించాల్సిన జీవీఎంసీ అధికారులు పట్టించుకోకుండా ప్రజాప్రతినిధుల చుట్టూ భజన చేస్తున్నారు. మరోవైపు ప్రజలందరి సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ... రోడ్ల విస్తరణతో టీడీపీ నాయకుల ఇళ్లు పోతాయని.., వాటిని కాపాడేందుకే పనులు మధ్యలోనే ఆపించేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 2024 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులను టీడీపీ నాయకులు, వ్యాపారుల స్వలాభం కోసం నిలిపేయడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా అవసరాల కోసం అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రజా ప్రతినిధులు స్వార్థంతో అడ్డుపడడం దారుణమని కూటమి **నేతల తీరుపై ఆరిలోవ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.**



విస్తరణకు నోచుకోని తోటగరువు - బాలాజీనగర్ ప్రధాన రహదారి



తోటగరువు - పెదగదిలి మార్గంలో నిలిచిపోయిన డబుల్ రోడ్డు విస్తరణ



విస్తరించాల్సిన పార్వతినగర్ - సూర్యతేజానగర్ రహదారి

ఆరిలోవ :

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో **ఆరిలోవలో** పలు అభివృద్ధి పనులు జరిగాయి. **ఇందులో భాగం**గా అప్పటి నగర మేయర్ గొలగాని **హరి వెంకట** కుమారి కృషితో బీఆర్‌టీఎస్‌లో పె**దగదిలి కూడలి** నుంచి తోటగరువు, బాలాజీనగర్, **అంబేడ్కర్** కూడలి, పార్వతినగర్ వరకు **బ్రిడ్జితోపాటు** సుమారు కిలో మీటరుకు పైగా డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.11.49 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు 2024 జనవరిలో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల వరకు కొంతమేరకు పనులు పూర్తయ్యాయి. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మిగిలిన పనులకు బ్రేక్ పడింది. ప్రజలకు ఉపయోగపడే ఈ పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించినవి కావడంతో స్థానిక టీడీపీ నాయకులు కొందరు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణపై ఒత్తిడి చేసి మధ్యలోనే నిలుపుదల చేయించారు. పెదగదిలి – తోటగరువు మధ్యలో రూ.3.45 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికే సుమారు 90 శాతం పూర్తి కావడంతో తప్పనిసరి పరిస్థితిలో మిగిలిన పనులు అధికారులు పూర్తి చేయాల్సి వచ్చింది. మిగిలిన రోడ్డు విస్తరణ పనులు మాత్రం మధ్యలోనే నిలిపేసి నేటికీ ప్రారంభించలేదు.

మధ్యలో నిలిచిపోయిన పనులు

రూ.8 కోట్లతో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, కాలువలు, డివైడర్ల అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిపేశారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి (గెడ్డపై కొత్త బ్రిడ్జి నుంచి) నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు పైగా కాలువలు, ఫుట్‌పాత్‌లు నిర్మించడానికి రూ.3.76 కోట్లు కేటాయించారు. బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, బాలాజీనగర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు కిలోమీటరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతోపాటు సెంట్రల్ మీడియా (డివైడర్), వీధి దీపాల ఏర్పాటు కోసం జీవీఎంసీ అధికారులు మరో రూ.1.75 కోట్లు కేటాయించారు. వీటితోపాటు సూర్యతేజానగర్ బ్రిడ్జి నుంచి పార్వతినగర్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు బీటీ రోడ్డు, కాలువలు, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లు, పార్వతినగర్ వద్ద క్రాస్ కల్వర్టు విస్తరణ, సెంట్రల్ మీడియా(డివైడర్), సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం అధికారులు రూ.2.53 కోట్లు కేటాయించారు. ఆయా పనులు కూడా 2024 సాధారణ ఎన్నికలకు ముందు ప్రారంభమయ్యాయి. పెదగదిలి నుంచి తోటగరువు మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన డివైడర్ పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. పెదగదిలి నుంచి తోటగరువు వెటర్నరీ ఆస్పత్రి వరకు డివైడర్ నిర్మించి వదిలేశారు. మిగిలిన రోడ్డులో మధ్యలో తవ్వేసి కొన్నాళ్ల తర్వాత పనులు జరపకుండా గోతులు పూడ్చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి పార్వతినగర్, సూర్యతేజానగర్ రోడ్డు పనులు ప్రారంభించ లేదు.

వేలాది మంది ప్రజలకు ఇబ్బందులు

ఆరిలోవ కాలనీ నుంచి బీఆర్‌టీఎస్ మీదుగా రోజూ వేలాది మంది ప్రజలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ సిటీ బస్‌లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై వేల సంఖ్యలో రోజూ అంబేడ్కర్ కూడలి నుంచి అటు సూర్యతేజానగర్ మీదుగా చినగదిలి కూడలికి, ఇటూ బాలాజీనగర్, తోటగరువు మీదుగా పెదగదిలి కూడలికి చేరుతుంటారు. రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఆయా రహదార్లు విస్తరించడం తోపాటు డబుల్ రోడ్లుగా మార్చాల్సిన అవసరం ఉంది. టీడీపీ నాయకుల స్వార్థం కోసం, వారికి లాభం చేకూర్చాలనే ఆలోచనతో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి వేల మందికి ప్రజలకు ఉపయోగపడే రోడ్ల విస్తరణ పనులు నిలిపేయడం మంచి పద్ధతి కాదని స్థానికులు మండిపడుతున్నారు. నలుగురు కూటమి నాయకుల కోసం వేల మంది ప్రజలకు అన్యాయం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.

టీడీపీ నాయకుల ఇళ్లు, వ్యాపారాలకు నష్టమని...

రోడ్ల విస్తరణ జరిగితే ఆరిలోవ ప్రాంతం రూపురేఖలు మారుతాయని స్థానికులు భావించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పరిష్కారమవుతాయని అనుకున్నారు. కానీ వారి ఆశలకు కొందరు స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకట్ట వేశారు. తోటగరువు నుంచి బాలాజీనగర్ వరకు, పార్వతినగర్ ప్రాంతంలో కొందరు టీడీపీ నాయకులు, మరికొందరు బీజేపీ నాయకులకు చెందిన ఇళ్ల భాగాలు రోడ్డు విస్తరణలో అధికారులు తొలగించాల్సి వస్తుంది. అలాగే తోటగరువు, బాలాజీనగర్‌లో రోడ్డును ఆనుకుని ఉన్న ఆ పార్టీ నాయకులకు చెందిన షాపులు, నివాసాలలో భాగాలు తొలగించాల్సి వస్తుంది. దీంతో ఎవరి కోసమో రోడ్డు నిర్మాణం జరిగితే మా ఇళ్ల భాగాలు, షాపులు కోల్పోతామని, అద్దెలు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతామని ఆ నాయకులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వద్ద మొరపెట్టుకున్నారట. దీంతో ఎమ్మెల్యే వారికి కొమ్ముకాచి జీవీఎంసీ అధికారులకు చెప్పి ఆరిలోవలో రోడ్డు విస్తరణ పనులు ఆపేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో చేసేదేమీలేక జీవీఎంసీ అధికారులు అంతవరకు జరుగుతున్న అభివృద్ధి పనులను ఆపేశారు. పనుల కోసం అప్పటికే తవ్విన గోతులను కాంక్రీట్ వేసి కప్పేశారు.

మోసపూరిత హామీలతోనే చంద్రబాబు గద్దెనెక్కారు



18వ వార్డు అంజయ్యనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఎంవీపీ కాలనీ : సూపర్‌సిక్స్ పేరిట మోసపూరిత హామీలిచ్చి 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. పార్టీ జీవీఎంసీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం అంజయ్యనగర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కారని దుయ్యబట్టారు. మహిళలకు ప్రతీ నెల రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, 50 ఏళ్లకే పింఛన్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలపై నేరాల్లో దేశంలో రాష్ట్రం 2వ స్థానంలో నిలవడం సిగ్గుచేటన్నారు. ఈ దుర్మార్గపు పాలన అంతమొందించడంలో మహిళలు ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు వానుపల్లి ఎల్లాజీ, రవితేజ, మహిళ విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి, పరదేశి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

ఎంవీపీ కాలనీ : విశాఖ నగర పరిశుభ్రతకు ప్రజలంతా ప్రాధాన్యమివ్వాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ – 2025లో భాగంగా 18వ వార్డు అప్పుఘర్‌లో నిర్వహించిన ఏక్ దిన్, ఏక్ సాత్, ఏక్ గంట కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలంతా తమ ఇంటితోపాటు పరిసరాలు, నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఇందుకోసం రోజులో ఒక గంట శ్రమదానం చేయాలన్నారు. అనంతరం కైలాసగిరి రోప్ వేని పరిశీలించి వ్యర్థాలు వెలికితీసి పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి, అదనపు కమిషనర్ రమణమూర్తి, జోన్ – 3 కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తులకు గడువు పెంచాలి



హెచ్‌బీకాలనీలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

మద్దిలపాలెం : ఆటో అండ్ మోటార్ డ్రైవర్లకు వాహన మిత్ర దరఖాస్తు కోసం గడువు పెంచాలని సీతమ్మధార హెచ్‌బీకాలనీలోని వుడా అపార్ట్‌మెంట్ వద్ద గల శిరిడీ సాయి ఆటో స్టాండ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ డ్రైవర్లందరికీ వాహన మిత్ర దరఖాస్తుకు గడువు పెంచి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తక్కువ సమయం ఇవ్వడంతోపాటు సచివాలయ సిబ్బంది సర్వర్లు పనిచేయడం లేదని కుంటి సాకులు చెప్పారాని ఆరోపించారు. ఈ నెల 24న కొత్త, పాత సభ్యుల నమోదును పూర్తిగా నిలిపివేశారని, దీంతో వేలాది మంది లబ్ధిదారులు వారి పేర్లు నమోదు చేసుకోలేపోయరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా డ్రైవర్ సోదరులందరూ వాహన మిత్ర కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా గడువు పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు అవనాపు శ్రీను, లంక గోవింద్, అప్పలనాయుడు, సూరిబాబు, రాజు, సోములు, పైడిరాజు, కన్నారావు డ్రైవర్లు పాల్గొన్నారు.

సన్నద్ధతతో ప్రాణనష్టం నివారించవచ్చు



ఆచార్య విలియమ్ కుమార్ మహంతితో ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ముందస్తు సన్నద్ధతతో భూకంప ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఐఐటీ ఖరగ్‌పూర్ జియాలజీ జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు విలియమ్ కుమార్ మహంతి అన్నారు. ఏయూను గురువారం సందర్శించిన ఆయన భూకంప ప్రమాదాలు, సంబంధిత పరిశోధనలపై రసాయన శాస్త్ర విభాగ సమావేశం మందిరంలో ప్రసంగించారు. భూకంపాలపై తగిన అవగాహన, సన్నద్ధత కలిగి ఉంటే నష్టాన్ని తగ్గించవచ్చని సూచించారు. భూకంపాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రస్తుతం విస్తృతంగా అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్ జియాలజీ జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యులు సైబాల్ గుప్త మాట్లాడుతూ భూకంపాలకు సంబంధించి చేసిన శాస్త్రీయ అధ్యయనాలను వివరించారు. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విశ్వవిద్యాలయంలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతనంగా బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రారంభించామని, అందుకు అవసరమైన ప్రయోగశాలలను సైతం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం అతిథులను సత్కరించారు.

కేఆర్‌ఎం కాలనీలో సారె ఊరేగింపు



దుర్గాదేవి మండపానికి ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న మొల్లి అప్పారావు, భక్తులు

మద్దిలపాలెం : శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కె.ఆర్.ఎం.కాలనీ యూత్ అసోసియేషన్ సభ్యులు 23 రకాల వంటకాలతో దుర్గాదేవి అమ్మవారికి గురువారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జీవీఎంసీ 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, భక్తులు ఊరేగింపుగా మండపం వద్దకు సారె తీసుకెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మీసాల ప్రదీప్, నిర్వాహకులు కిరణ్, నిశాంత్, తేజ, రమణ, రఘు, రాజు, అభి, లోకేష్, వినయ్, రాకేష్, వైకుంఠ, జస్వంత్, వెంకట్, హరీష్, గణేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రమదానం



బీచ్ పరిసరాలను శుభ్రపరచిన ఇగ్నో విద్యార్థులు, ఉద్యోగులు



విశాలాక్షినగర్ పార్కు శుభ్రం చేస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి, అధికారులు, సిబ్బంది

ఆరిలోవ : నియోజకవర్గ పరిధి జీవీఎంసీ జోన్ – 2లో 9 నుంచి 13వ వార్డు వరకు గురువారం ఏక్ దిన్ ఏక్ సాత్ ఏక్ గంట కార్యక్రమం పేరుతో శ్రమదానం నిర్వహించారు. ఆయా వార్డుల్లో పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉత్సాహంగా పాల్గొని పార్కులు, ఆస్పత్రుల వద్ద శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. తొమ్మిదో వార్డులో శానిటరీ సిబ్బందితో కలిసి జోన్ – 2 జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పాల్గొని పార్కులు, రోడ్లు పక్కన శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సిబ్బంది, స్థానిక నాయకులు బుడుమూరు గోవింద్, తదితరులు పాల్గొన్నారు. పదకొండో వార్డులో బాలాజీనగర్ యూపీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం బ్యానరు ప్రదర్శించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి బంగార్రాజు, స్థానిక నాయకులు ముగడ రాజారావు, రాగతి అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు. పదమూడో వార్డులో ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద యూపీహెచ్‌సీ ఆవరణలో చేపట్టిన శ్రమదానంలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, తురకపూడి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో ఇగ్నో 'స్వచ్ఛత హీ సేవ'

ఎంవీపీ కాలనీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా పక్షోత్సవాలను ఇగ్నో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎంసీఏ తీరాన్ని అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర అందరి బాధ్యత అన్నారు. ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు.

సముద్ర వనరులను వినియోగించుకోవాలి



సదస్సు సంచిక ఆవిష్కరిస్తున్న గుప్త, తదితరులు

ఏయూ క్యాంపస్ : సముద్ర వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎంఎల్‌ఆర్‌ఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎం.గుప్త సూచించారు. బీచ్‌రోడ్డులోని ఐకార్ – సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సముద్ర ఆరోగ్యం, సుస్థిర అభివృద్ధి – సవాళ్లు, పరిష్కారాలు సదస్సు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్ర వనరులను అర్థం చేసుకోవడం ఎంతో ప్రధానమన్నారు. అంతర్జాతీయ జలాల్లో వనరులను సుస్థిరంగా వినియోగించుకోవాలని సూచించారు. ఐకార్ – సిఫ్ట్ ఇన్‌చార్జి సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు మాట్లాడుతూ మానవ ఆరోగ్యం, బ్లూ ఎకానమీలో సముద్రాల భూమికను వివరించారు. మెరుగైన భవిష్యత్ కోసం సముద్రాలను సంరక్షించుకోవాలన్నారు. ఐకార్ – సిఫ్ట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఐకార్ – సిఫ్ట్, ఏ గ్లింప్స్ శీర్షికతో తీర్చిదిద్దిన హిందీ సంచికను ఆవిష్కరించారు. ఈ పత్రికలో ఐకార్ – సిఫ్ట్ విశాఖపట్నం కేంద్రం సాధించిన విజయాలను పొందుపరిచారు. సంస్థ టెక్నికల్ అధికారి భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీలో బురద రోడ్లు

- వాహనదారులకు తప్పని అవస్థలు



బురదలో కూరుకుపోయిన వాహనం



బురదమయంగా రామ్‌నగర్ రోడ్డు

బీచ్‌రోడ్డు : స్మార్ట్‌సిటీలో బురద రోడ్లతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉన్న రామ్‌నగర్ బజార్ రోడ్డు బురదతో నిండిపోయింది. డ్రైనేజీ పనుల నిమిత్తం నెల రోజుల కిందట తవ్విన మట్టి రోడ్డుపైనే వదలేయడంతోపాటు గోతులు కూడా సరిగ్గా పూడ్చలేదు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం బురదమయమై మట్టి రోడ్డును తలపిస్తోంది. దీంతో అటుగా వెళ్తున్న వాహనాలు డ్రైనేజీ కోసమని తవ్విన గోతుల్లో కూరుకుపోతున్నాయి. ఆ మార్గంలో వెళ్లాలంటేనే వాహనాదారులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే డ్రైనేజీ పనులను పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కాత్యాయనీదేవి అలంకరణలో పోలమాంబ



అమ్మవారి సన్నిధిలో మువ్వల సురేష్, భక్తులు



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో చండికా దేవి అమ్మవారు

బీచ్‌రోడ్డు : పెద్దవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అర్చనలు, విశేష పూజలు, ఉత్సవమూర్తికి అభిషేకాలు జరిపించారు. వేద పండితుల సారథ్యంలో చండీహోమం నిర్వహించారు. టీటీడీ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ కందుకూరి సుబ్రహ్మణ్య శర్మ చండీ పారాయణ విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- జీవీఎంసీ 20వ వార్డులోని మునుసబు వారి వీధిలో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ దర్శించుకుని పూజలు చేశారు.

చండికాదేవి ఆలయంలో కుంకుమార్చన

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సావాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజూ చండీ హోమంతోపాటు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహన్‌రావు, వెంకటరావు, టీఎస్ మూర్తి, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.